క్లుప్తంగా

ప్రత్యేక బస్సు నడపాలని వినతి



ఊట్కూరు: మండలంలోని వీరలింగేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక బస్సును నడిపించాలని కోరుతూ శుక్రవారం పేట డిపో అసిస్టెంట్ మేనేజర్ అలివేలమ్మకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని ఆర్టీసీ అధికారులు ఆదివారం నుంచి ప్రత్యేక బస్సులు నడిపించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో అడ్వకేట్ భరత్, రవి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యకర్తల సమావేశం



ధన్వాడ: మండల కేంద్రంలో శుక్రవారం సీపీఐ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ పాల్గొని మాట్లాడారు.. మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ జెండాను ఎగురవేసేందుకు కృషిచేయాలని అన్నారు. కార్మికుల అభ్యున్నతి కోసం నిత్యం సీపీఐ కృషి చేస్తుందన్నారు. ప్రతి పల్లెలో కార్మికుల జెండాను ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో భాను, సూరి, బాలస్వామి, కథలప్ప, మల్లేష్, బాలనర్సింహులు, అంజి, రాములు, కురుమయ్య పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



ఊట్కూరు: ఉపాధిహామీ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనాన్ని ప్రభుత్వం వెంటనే పెంచాలని నినాదాలు చేశారు. నల్లబ్యాడ్జీలతో విధుల్లో హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీఓ సత్యప్రకాష్, టీఏ గోపాల్, మైపాల్‌రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల కమిటీ ఎన్నిక



మద్దూరు: తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అనుబంధం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కమిటీని శుక్రవారం మండలంలోని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎదిరింటి నర్సింహులు, అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా భీములు, సహాయ కార్యదర్శిగా మహిపాల్, నిడ్జింత భీములు, కో శాధికారిగా రాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మరికల్: మండలంలోని ఇళ్ల మధ్యన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. గ్రామానికి, వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా చేసే 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ మురుగునీరు నిలిచింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు, పాలకుల దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇళ్ల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ మురుగు నీటిని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



దామరగిద్దలో బహుమతులు అందజేస్తున్న సీఐ



జాజాపూర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివకుమార్

నారాయణపేట రూరల్/ఎడ్యుకేషన్: వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని ఆర్టీఓ మేఘా గాంధీ, సీఐ శివకుమార్ అన్నారు. మండలంలోని జాజాపూర్ జెడ్పీ స్కూల్లో నిర్వహించిన అవగాహన సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. అతివేగంగా నడపడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు. వాహనాలను ఓవర్టేక్ చేసే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. వాహనదారులు లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా సైన్ బోర్డ్, సిగ్నల్స్, సైబర్ నేరాలు, షీ టీం తదితర విషయాలను తెలియజేశారు. విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక పోటీల విజేతకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాయుడు, డీఎస్ఓ భాను ప్రకాష్, శివ రాములు, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు..

దామరగిద్ద: రోడ్డు భద్రత నియమాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ శివశంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్ఐ రాజు, హెచ్ఎం అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు శంభులింగం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సీఎంకు వినతి

నారాయణపేట: సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని సమస్యలపై సీఎంకు వినతి పత్రం అందజేశారు. నారాయణపేట –కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కొన్ని మార్పులు చేర్పులు చేయడంతో రైతులకు అదనంగా వేల ఎకరాలకు సాగు నీరందుతుందని వివరించారు. అదేవిధంగా నియోజకవర్గంలో మూడు కొత్త మండలాలు, నూతన పంచాయతీల ఏర్పాటుపై చర్చించారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందిస్తూ నియోజకవర్గానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.



సీఎంతో అభివృద్ధి పనులపై వివరిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే



మక్తల్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శుక్రవారం ఢిల్లీలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించారు. మక్తల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు హేమ సుందర్, పూజ, శివ తదితరులు ఉన్నారు.

పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



మాగనూరులో అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు



హిందుపూర్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేష్

మాగనూర్: ప్రజలు పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని పోలీసులు, రెవెన్యూ అధికారులు అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్మపల్లిలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న వాటిని పరిష్కరించడమే పౌర హక్కుల సాధన అని అన్నారు. సమాజంలో మూఢ నమ్మకాలు లేకుండా కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ సమానమేనని, ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి భిన్నత్వంలో ఏకత్వంగా జీవించాలని సూచించారు. అదే విధంగా రాజ్యాంగం కల్పించిన హక్కులను వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ శ్రీశైలం, ఏఎస్ఐ మన్నన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందుపూర్‌లో..

కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో శుక్రవారం పౌర హక్కుల వినియోగంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రతి నెల చివరి వారంలో పౌర హక్కుల వినియోగంపై సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి పౌరుడు కూడా రాజ్యాంగం కల్పించిన తన హక్కులను ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రామంలో రెండు గ్లాసుల విధానం, కుల వివక్ష ఉండొద్దని, ప్రతి పౌరుడిని గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వ్యాసరచన పోటీలు



కొత్తపల్లి: భూమికా ఉమెన్స్ కలెక్టివ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిడ్జింత ఉన్నత పాఠశాల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్యంగా ఆడ పిల్లల హక్కులపై సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులు, భూమికా కలెక్టివ్ కో ఆర్డినేటర్ నాగమ్మ, నరేష్, లాజర్, దేవేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మెర్సీ వసంత

నారాయణ పేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని స్థానిక చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అనే అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ వసంత, సమన్వయకర్త రియాజ్ ఖాన్ పాల్గొన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ... విద్యార్థులు వినూత్నంగా ఆలోచిస్తేనే పారిశ్రామిక వేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. కేవలం చదువుపైనే కాకుండా మిగితా వాటిపై కూడా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. అప్పుడే మీరు అన్ని రంగాలలో సమగ్రాభివృద్ధి సాధిస్తారన్నారు.

పుర కమిషనర్‌గా భోగేశ్వర్లు

నారాయణ పేట టౌన్: పట్టణ మెప్మా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో పురపాలక సంఘం కమిషనర్‌గా నూతన బాధ్యతలు స్వీకరించిన భోగేశ్వర్లును స్వాగతం పలికి మహిళ సంఘాల సభ్యులు సన్మానించారు. అనంతరం కమిషనర్ భోగేశ్వర్లు మెప్మా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించి, సంఘాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు సాయి కుమారి, ఆర్పీల యూనియన్ ప్రెసిడెంట్ సౌభాగ్యలక్ష్మి, పలువురు మహిళలు పాల్గొన్నారు.



కమిషనర్‌ను సన్మానిస్తున్న మెప్మా సభ్యులు

‘అర్హులకే సంక్షేమ పథకాలు అందించాలి’



అమరచింత: అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేసి ఆదుకోవాలంటూ బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల వద్ద వేర్వేరుగా ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించారని, గెలిచిన తర్వాత ప్రజా సంక్షేమం విస్మరించారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు అంటూ వంద అబద్ధాలు ఆడుతున్న సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని జోస్యం చెప్పారు. ఇళ్లపై ఇందిరమ్మ బొమ్మ పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రధాని ఆవాజ్ యోజన పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షలు ఇస్తుందని, అర్హులకు ఇచ్చే ప్రొసీడింగ్‌లో ప్రధాని ఫొటో పెట్టాలని డిమాండ్ చేశారు. పట్టణంలో స్వచ్ఛమైన తాగునీటి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.13 కోట్లతో వాటర్ ట్యాంకులను నిర్మించే పనులకు స్థానిక ఎమ్మెల్యే హాజరు కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసులు, మున్సిపల్ మేనేజర్ ఇసూఫ్‌కు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో మేర్వరాజు, భాస్కర్, మంగ అంజి, మల్లారెడ్డి, హరీశ్, నరాల నారాయణ, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే కృషి అభినందనీయం

మాగనూర్: నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని పదోతరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందించడం అభినందనీయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే కృషి గర్వించదగిన విషయమని అందుకు మండల ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని కోరారు.

హక్కుల కోసం పోరాటం

అమరచింత: తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల యూనియన్ జిల్లా డైరీని శుక్రవారం తహసీల్దార్ రవికుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఎన్జీఓ అధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఏకైక సంఘం తమదే అన్నారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన హక్కులను పొందేందుకు రాజీలేని పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. డీటీ రెడ్యానాయక్, ఆర్ఐలు గోపాల్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



కోస్గి కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు



నేరడగం పాఠశాలలో ..

కోస్గి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతతోపాటు మెనూ ప్రకారం అందించాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని నాచారం కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలించారు. బియ్యం, కూరగాయలతో భోజన నాణ్యత విషయంలో ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఇందులో ఎస్ఓ స్వాతి, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

నేరడగం పాఠశాలలో..

మాగనూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ రహ్మతుద్దీన్, ఇన్‌చార్జి ఎంపీఓ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని తెలిపారు. అదేవిధంగా సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాద్వార్ పాఠశాలలో..

మరికల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కాశీ, మహేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాద్వార్ పాఠశాలను వారు తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని ఈ విషయాన్ని తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెనూ ప్రకారం అందించాలని వారు డిమాండ్ చేశారు.

పేదలకు అల్పాహారం వితరణ



అల్పాహారం వితరణ చేస్తున్న లయన్స్ సభ్యులు

నారాయణపేట రూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పట్టణంలోని చిల్డ్రన్స్ ఆస్పత్రి వద్ద పేదలకు అల్పాహార వితరణ చేశారు. బీఈడీ కళాశాల ఉపన్యాసకులు రంజిత్ జ్ఞాపకార్థంగా మాజీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్ హాజరై మాట్లాడారు.. రంజిత్ కుమార్ విద్యారంగంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో లయన్ సభ్యులు కన్న జగదీష్, రవికుమార్ గౌడ్, ఆత్మరాం, సురేందర్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



మద్దూరులో ఆన్‌లైన్ టాలెంట్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులు

మద్దూరు: మండల స్థాయిలో ఆన్‌లైన్ టాలెంట్ టెస్టును శుక్రవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ టెస్టుకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఆన్‌లైన్ టెస్టులో మొదటి బహుమతి శశాంక్, ద్వితీయ బహుమతి త్రిష, మోఘవాణి, తృతీయ బహుమతి భానుప్రియలకు బాలుర ఉన్నత పాఠశాల మద్దూరు చెందిన వారు కైవసం చేసుకున్నారు. పాఠశాల హెచ్ఎం సవిత, భౌతిక శాస్త్ర ఫోరం మండలాధ్యక్షుడు బాలజీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, రాజునాయక్, సాయికుమార్, రాఘవేందర్‌రెడ్డి, గఫార్, మహేందర్, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పదోతరగతి విద్యార్థులకు మా' మిత్రుల ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. వరుసగా మూడోసారి నిర్వహించిన టాలెంట్ టెస్టుకు 450మంది విద్యార్థులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. త్వరలో ఫలితాలు వెల్లిడించి ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని వారు తెలిపారు.



మరికల్‌లో పరీక్షలు రాస్తున్న పదోతరగతి విద్యార్థులు

విద్యార్థులు బాగా చదివి లక్ష్యాన్ని చేరాలి



విద్యార్థులకు బూట్లు పంపిణీ చేస్తున్న రషీద్

నారాయణ పేట ఎడ్యుకేషన్: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎంఏ రషీద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక మైనార్టీ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు బూట్లు, కాస్మొటిక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల చదువులకు ప్రభుత్వం ఎంతో ఆర్థిక సహాయం అందిస్తుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్, అధ్యాపకుల బృందం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు సముచిత స్థానం కల్పించాలి



నారాయణపేటలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



మాగనూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నారాయణ పేట టౌన్: వెనకబడి ఉన్న పేట జిల్లాకు వచ్చే కేంద్ర బడ్జెట్‌లో సముచిత ప్రాధాన్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.వెంకట్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం నాయకులు జిల్లాలోని పలు సమస్యలపై ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కృష్ణా వికారాబాద్ రైల్వే లైన్, జిల్లాకు సైనిక పాఠశాల, పాలమూరు–రంగారెడ్డికి జాతీయ హోదా కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈసారైన బడ్జెట్‌లో సముచిత ప్రాధాన్యం కల్పించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు బాల్‌రాం, గోవింద్‌రాజ్, దస్తప్ప, బలరాం, సత్యప్ప పాల్గొన్నారు.

రైల్వేలైన్ పనులు చేపట్టాలి..

మాగనూర్: కేంద్ర ప్రభుత్వం కృష్ణా వికారాబాద్ రైల్వే లైన్ పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి. ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని బస్టాండ్ చౌరస్తాలో వారు నిరసన వ్యక్తం చేశారు. భరత్‌కుమార్, ఆంజనేయులు, బాలురాజు, నర్సింహ, మహదేవ్ పాల్గొన్నారు.

- దామరగిద్దలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం చేయొద్దంటూ, జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాల్ కోరారు. శివకుమార్, మహేష్, జోషి, హన్మంతు పాల్గొన్నారు.